కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 25, పచ్చిమిర్చి 50 , బెండ 45, కాకర 40, దొండ 40, దోస 30, ఆలు 25, చామ 50, కీర 25, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 50, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 50, చిక్కుడు 60, ఉల్లి 50–60 (1 కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 200, వెల్లుల్లి 300.

నిరంతరాయంగా వెలుగుతున్నాయ్..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో స్ట్రీట్ లైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పగలు, రాత్రి తేడా లేకుండా నిరంతరాయంగా వెలుగుతున్నాయి. నల్లగండ్ల హుడా కాలనీలోని పలు రోడ్లలో ఈ పరిస్థితి నెలకొంది. అపర్ణ సైబర్ లైఫ్ ఎదురుగా ఉన్న రోడ్డులో స్ట్రీట్‌లైట్లు పగటి వేళ వెలుగుతుండటం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విద్యుత్ దుబారాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అపర్ణ సైబర్ లైఫ్ ఎదురు రోడ్డులో వెలుగుతున్న స్ట్రీట్‌లైట్

వినరా.. 'వేమన' వేదన

5 తరగతులు.. 2 గదులు...

- 40 గజాలలో పాఠశాల నిర్మాణం
- కనీస వసతులు నిల్
- వేమన వీకర్ సెక్షన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దుస్థితి



చందానగర్ వేమన వీకర్ సెక్షన్ ప్రాథమిక పాఠశాల

హఫీజ్‌పేట్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను మన ఊరు– మన బడిలో అభివృద్ధి చేస్తుంది. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందించే విధంగా చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు ప్రారంభించింది. కానీ చందానగర్ డివిజన్ పరిధిలోని వేమన వీకర్ సెక్షన్‌లోని ప్రాథమిక పాఠశాలలో కనీస వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. 2002లో ప్రారంభమైన పాఠశాలకు అప్పటి నుంచి ఇప్పటి వరకు సౌకర్యాలు లేవు. ముఖ్యంగా పాఠశాల భవనంను 40 గజాలలో నిర్మించారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 47 మంది విద్యార్థులు ఉన్నారు. ఉపాధ్యాయులు 5గురు ఉండాల్సి ఉండగా ఇద్దరు ఉన్నారు. ప్రజాప్రతినిధులకు పాఠశాల సమస్యలపై విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.



- 1 నుంచి 5 తరగతి విద్యార్థులు రెండు గదులలోనే ఉంటున్నారు.
- పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో స్కూలు ఎదుట ఇష్టానుసారంగా వాహనాలు నిలుపుతున్నారు.
- విద్యార్థులకు క్రీడా మైదానం లేదు
- జీహెచ్ఎంసీ మరుగుగొడ్లు నిర్మించినా నిరుపయోగం



పాఠశాలలో అశుభ్రంగా మరుగుదొడ్లు

- మంచినీటి ట్యాంక్ లేదు. ఒక బిందె నీటిని 50 మంది తాగాల్సిన పరిస్థితి.
- మధ్యాహ్న భోజనం అక్షయపాత్ర నుంచి వస్తుంది. ఉదయం అల్పాహారం రావడం లేదు.
- స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి 5 కంప్యూటర్లు అందించారు.

ప్రహరీ లేక ఇబ్బందులు



పాఠశాల చుట్టు ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. స్కూల్ ముందు ఉన్న ఖాళీ స్థలంలో అంగన్‌వాడీ గదితో పాటు వంటశాల నిర్మించాలి. పిల్లలు ఆడుకోవడానికి ఆట స్థలం ఏర్పాటు చేయాలి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి.

– మల్లేష్, వేమన వీకర్‌సెక్షన్ వాసి

అదనపు గదులు నిర్మించాలి



రెండు తరగతి గదుల్లో 47 మంది విద్యార్థులకు పాఠాలు చెప్పాలంటే టీచర్లు ఇబ్బందిపడుతున్నారు. ఈ పాఠశాలను ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలి.

–వెంకటేశ్వర్లు, వేమన వీకర్ సెక్షన్‌వాసి



పాఠశాల ముందు ఇష్టానుసారంగా వాహనాలు నిలిపిన దృశ్యం



విద్యార్థుల కోసం నీటి బిందె

ఎమ్మెల్యే గాంధీకి అభినందనలు



ఎమ్మెల్యే గాంధీని మర్యాద పూర్వకంగా కలిసిన మాదాపూర్ డివిజన్ నాయకులు



సత్కరించిన షేక్ హమీద్‌పటేల్ దపంతులు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో మూడవ సారి గెలుపొందిన ఆరెకపూడి గాంధీని పలువురు సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. వివేకానందనగర్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, నాయకులు, కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు గాంధీని మర్యాద పూర్వకంగా కలుస్తున్నారు.

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ఎమ్మెల్యేగా ఆరికెపూడి గాంధీకి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు వెళ్లి శాలువాతో సన్మానించారు. బీఆర్ఎస్ డివిజన్ గౌరవాధ్యక్షులు డి.వీరేశంగౌడ్, అధ్యక్షులు రాజుయాదవ్, బీఆర్ఎస్ నాయకులు అనిరుధ్ యాదవ్ తదితరులున్నారు.

గంగారం పెద్దచెరువు ఆక్రమణలను అడ్డుకోవాలి



గంగారం పెద్దచెరువులో మట్టి పోసిన దృశ్యం

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం పెద్దచెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జనం కోసం అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగారం పెద్ద చెరువు సుమారు 140 ఎకరాలు ఉందని కబ్జాదారులు ఆక్రమించుకుంటూ మట్టిని తరలిస్తున్నారన్నారు. గతంలో కూడా బఫర్ జోన్‌లో ఇళ్ల నిర్మాణం చేస్తుంటే ఇరిగేషన్, మండల రెవెన్యూ అధికారులు వచ్చి కూల్చివేతలు చేశారన్నారు. చెరువులో అక్రమంగా మట్టి పోస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి, శేరిలింగంపల్లి మండల తహసీల్దార్, జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, సర్కిల్– 21 ఉప కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

గీతంలో నార్త్ ఫ్లోరిడా విశ్వవిద్యాలయం బృందం

పటాన్‌చెరు టౌన్: నార్త్ ఫ్లోరిడా విశ్వవిద్యాలయంలోని కాలేజ్ ఆఫ్ బిజినెస్ డీన్ రిచర్డ్ బుటిమర్ బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. నార్త్ ఫ్లోరిడా విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న కోర్సులు, వ్యవధి, ఫీజు, చదువుతూనే సంపాదించే అవకాశాలు, కోర్సు పూర్తయ్యాక శిక్షణ, పని చేయడానికున్న వ్యవధి, ఉద్యోగావకాశాలు తదితరాల గురించి వివరించారు. యూఎస్‌లో కెరీర్‌కు ఇవ్వాల్సిన ప్రాముఖ్యతను ఐఎంఎఫ్ఎస్ కన్సల్టెంట్ సంస్థ దక్షిణ భారత డైరెక్టర్ అజయ్‌కుమార్ తెలిపారు.

సమీక్ష సమావేశం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని వార్డు కార్యాలయంలో బుధవారం పుష్పనగేష్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. పలు కాలనీలో డ్రైనేజ్ ,రోడ్లు, విద్యుత్ సమస్యలున్నాయని తెలిపారు. ఉప కమిషనర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పటాన్‌చెరు టౌన్: ఇంట్లో కిందపడి గాయపడ్డ మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డిని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులతో హైదరాబాద్‌లో ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలి



అధ్యాపకులతో మాట్లాడుతున్న ఢిల్లీ బృందం

న్యూఢిల్లీ సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ బృందం

రాయదుర్గం: రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ప్రాంగణాన్ని న్యూఢిల్లీలోని సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ బృందం బుధవారం సందర్శించింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ ఆశిష్‌ధావన్, సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ శ్వేతాశర్మ, సెంటర్ ఫర్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్ సీఈఓ విజయ్ పింగళే బృందం విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. తరగతిలో బోధనా విధానం, మౌలిక వసతులు తదితరాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. తరగతి గదిలో బోధనా విధానం , విద్యార్థులు ప్రతి అంశాన్ని ఎంతవరకు అర్థం చేసుకుంటున్నారనే అంశాన్ని పరిశీలించారు. అనంతరం హెచ్ఎం తాజ్‌బాబుతో సమావేశమయ్యారు. ఈ బృందం వెంట కోఆర్డినేటర్ వినాయక్, కాంప్లెక్స్ హెచ్ఎం తాజ్‌బాబు, ఫౌండేషన్ ప్రతినిధి సురేష్ ఉన్నారు.

బొటానికల్ గార్డెన్‌కు 2 బ్యాటరీ వాహనాలు అందజేత



అధికారులకు బ్యాటరీ వాహనాలను అందిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

గచ్చిబౌలి: బొటానికల్ గార్డెన్‌కు ఎస్‌బీఐ గచ్చిబౌలి శాఖ అధికారులు కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రెండు గోల్ఫ్‌కార్ట్ బ్యాటరీ వాహనాలను బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ సైబరాబాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కుమార్‌రోహిత్ మాట్లాడుతూ బొటానికల్ గార్డెన్ బాగా అభివృద్ధి చెందిందన్నారు. గార్డెన్‌ను సందర్శించే పిల్లలు, పెద్దలకు ఉపయోగకరంగా ఉండేలా వాహనాలను అందించామన్నారు. గార్డెన్‌ని బొటానికల్ ప్యారడైజ్‌గా తీర్చిదిద్దిన ఎండీ డాక్టర్ జి చంద్రశేఖర్‌రెడ్డిని ఆయన అభినందించారు. అటవీ అభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ జి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే గార్డెన్‌లో 1500 రకాల అరుదైన జాతుల మొక్కలను నాటినట్లు, మరో 500 మొక్కలు నాటనున్నామన్నారు. లోటస్ పాండ్, పర్యావరణ అధ్యయన కేంద్రం, ఆడియో వీడియో హాల్, కాక్టస్ గార్డెన్, హెర్బల్ మెడిసినల్ గార్డెన్, క్లైంబర్స్, క్రీపర్స్, హెర్బ్స్, షర్బ్స్ ప్లాంట్ యొక్క ప్రయోజనాలు నక్షత్రవనం, నవగ్రహవనం, రాశివనం తదితరాల గురించి వివరించేందుకు గైడ్‌లు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ సేల్స్ మేనేజర్ ఉమాకాంత్, యోనో హైటెక్ సిటీ, గచ్చిబౌలి బ్రాంచ్ మేనేజర్ సౌజన్య, రమేష్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్, డైరెక్టర్ ఎం జేఅక్బర్, ఎకో టూరిజమ్ ప్రాజెక్ట్స్ మేనేజర్ సుమన్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, డిప్యూటీ ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్‌రెడ్డి, బొటానిస్ట్ డాక్టర్ వీరకిషోర్, శాంసన్‌రాజు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

శేరిలింగంపల్లిజోన్ బృందం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళులు అర్పించారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు కాలనీలు, బస్తీలలో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు, సంఘాల నాయకులు, సభ్యులు నివాళులు అర్పించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులు నివాళులు అర్పించారు. శేరిలింగంపల్లి గోపీనగర్ అంబేడ్కర్ భవన్‌లో జనచైతన్య ఎస్సీ,ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యక్షులు నర్సింహ, కమిటీ సభ్యులు పెంటయ్య, సత్యనారాయణ, తుకారాం, రాజేందర్, ఆనంద్ పాల్గొన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవితం నేటి తరాలకు ఆచరణీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి,నాయకులు



హఫీజ్‌పేట్‌లో.. నివాళులు అర్పిస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



చందానగర్ జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద.. మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది



మసీదుబండలో.. బీజేపీ నాయకుల నివాళి

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ..

జగద్గిరిగుట్ట: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ లక్షలు వసూలు చేసి తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తిపై జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జగద్గిరిగుట్ట పరిధి ఆల్విన్ కాలనీకి చెందిన వెంకటనాగపూర్ణ కిషోర్‌కు దూరపు బంధువైన ఏపీ కృష్ణాజిల్లా బావదారపల్లికి చెందిన మలిశెట్టి గోపీచంద్ సోమాజిగూడలోని క్యాంట్ క్లౌడ్ సొల్యూషన్స్ కంపెనీలో డబ్బులు ఇచ్చి ఉద్యోగం సంపాదించానని నమ్మబలికాడు. కిషోర్ భార్యకు సైతం ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పిన గోపీచంద్ అతని వద్ద 2.3 లక్షల నగదును తీసుకున్నాడు. అదే విధంగా కిషోర్ బావమరిది శుభాకర్‌కు సైతం జాబ్ ఇప్పిస్తానని చెప్పి మరో రూ.2.3 లక్షలు వసూలు చేశాడు. ఇలా సంతోష్ అనే వ్యక్తి నుండి రూ.4 లక్షలు, శ్యామ్ సుందర్ (రూ.1.3 లక్షలు) ఇలా పలువురి నుంచి గోపీచంద్ డబ్బులు తీసుకున్నాడు. కిషోర్ భార్య, బావమరిదిలకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహించిన గోపీచంద్ వారికి ఆఫర్ లెటర్, జాయినింగ్ లెటర్లను సైతం ఇచ్చాడు. దీంతో వారు సోమాజిగూడలోని అతను చెప్పిన అడ్రస్‌కు వెళ్లగా నా కంపెనీ లేకపోవడంతో గోపిచంద్ కుటుంబ సభ్యులను సంప్రదించగా ఇంట్లో గొడవ పడి వెళ్లిపోయాడని, అతని విషయం తెలియదన్నారు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు జగద్గిరిగుట్ట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న వేడుకల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామివారికి 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. అలంకరణ, హోమం అనంతరం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం సుందరకాండ పారాయణం, హోమం, పుష్పయాగం కనుల పండువగా జరిగాయి.

'మనూ'లో రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపు గడువు పెంపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో దూర విద్యా కోర్సులలో ఫాలో ఆన్ కోర్సులకు నమోదు చేసుకోవడం , రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపు గడువు తేదీని పొడిగించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(డీడీఈ) ఫీజు పోర్టల్‌లో ఫాలో ఆన్ రిజిస్ట్రేసన్ ఫీజు చెల్లింపు కోసం చివరి తేదీని ఐయూఎంఎస్, సమర్థ్‌కి గడువు తేదీని డిసెంబర్ 31వరకు పొడిగించారు. బ్యాచ్, ప్రోగ్రామ్‌ల గురించిన వివరాల కోసం విద్యార్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

సీపీఆర్ పై విద్యార్థులకు అవగాహన

పటాన్‌చెరు టౌన్: నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్స్ (ఎన్బీఈఎంఎస్), ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ స్టూడెంట్స్ ఫోరమ్ (ఐపీఏ-ఎస్ఎఫ్)ల సంయుక్త సౌజన్యంతో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో బుధవారం కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్) పై విద్యార్థులకు వర్చువల్‌గా శిక్షణ నిచ్చారు. సీపీఆర్ అనేది గుండె కండరాలపై ఒత్తిడి పెంచడం ద్వారా సరైన వైద్య సహాయం పొందేవరకు వ్యక్తి జీవితాన్ని నిలబెట్టడానికి ఉపయోగించే ఒక ముఖ్యమైన సాంకేతికత. శిక్షణ పొందిన వైద్యుడు సీపీఆర్ చేయడంపై వివరణాత్మక సూచనలను అందించారు.దీనిని నేర్చుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలను జారీచేశారు.ఈ ఆన్‌లైన్ సెషన్ లో గీతం ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీ.ఎస్.కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

12న కామాక్షి అమ్మవారికి లక్ష పుష్పార్చన

కూకట్‌పల్లి: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని కేపీహెచ్‌బీకాలనీ మూడవ లైన్లోని శ్రీ చక్రాధిష్టాన కామాక్షీ సమేత ఏకాంబరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. 7వ తేదీ గురువారం బహుళ ఏకాదశి సందర్భంగా సామూహిక శ్రీరమా సమేత సత్యనారాయణస్వామి వ్రతం, 10వ తేదీ ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీపార్వతీ పరమేశ్వరుల కల్యాణం, 11వ తేది సోమవారం మాసశివరాత్రి ఉదయం 5 గంటలకు స్వామి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, 12వ తేదీ మంగళవారం అమావాస్య సాయంత్రం 6 గంటలకు శ్రీ కామాక్షి అమ్మవారికి లక్ష పుష్పార్చన ఉంటుందన్నారు. ప్రతి సోమవారం సాయంత్రం 6 గంటలకు అన్నదానం జరుగుతందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా చండీహోమం



చండీహవన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

శేరిలింగంపల్లి: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని తారానగర్‌లోని తుల్జాభవాని ఆలయంలో సామూహిక చండీహవనం కార్యక్రమాన్ని బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈఓ సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అర్చకుడు మాడ్గుల ప్రణీత్‌కుమార్ శర్మ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు సత్యనారాయణస్వామి వ్రతం

తారానగర్‌లోని తుల్జాభవాని ఆలయంలో గురువారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ. 7,11,153



లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈవో లావణ్య

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు బుధవారం చేపట్టారు. ఆలయ ఈవో ఎన్. లావణ్య, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యుడు నవీన్ కుమార్ పటేల్ లెక్కింపును పరిశీలించారు. హుండీ ఆదాయం రూ. 7,11,153 లక్షలు వచ్చినట్లు ఈవో లావణ్య తెలిపారు. హుండీ లెక్కింపును సెప్టెంబర్ 12న చేపట్టామన్నారు. వెంకటేశ్వర స్వామి దేవస్థానంతో పాటు శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి, ఇతర ఉప ఆలయాలకు సంబంధించి హుండీలు లెక్కించామని ఆమె వివరించారు.

వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుండి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన రాములు అతని బావమరిది సునందు(23) ఇరువురు బతుకుదెరువు కోసం అమీన్‌పూర్ పరిధిలోని బంధంకొమ్ముకు ఐదు సంవత్సరాల క్రితం వచ్చారు. మదీనాగూడ పరిధిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 3 వ తేదీన రాములు డ్యూటీకి వెళ్లగా సునందు ఇంటి వద్ద ఉన్నాడు. సాయంత్రం రాములు ఇంటికి వచ్చి చూసేసరికి సునందు కనిపించలేదు. అయితే సునందు తనకు సంబంధించిన సామాగ్రి తీసుకుని వెళ్లిపోయాడు. వెళ్లాడు. స్థానికంగా, తెలిసిన వారి వద్ద స్వగ్రామంలో విచారించగా ఆచూకీ లభించలేదు.సునంద్ అదృశంపై బుధవారం మేనబావ రాములు అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్ట్‌టైం జాబ్ అంటూ..

- టాస్కులు, కమిషన్‌ల పేరుతో మోసం
- రూ.7 లక్షల 6 వేలు పోగొట్టుకున్న బాధితుడు
- సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.7 లక్షల 6 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని శ్రీవాణినగర్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ తన వాట్సాప్‌కు నవంబర్ 23 న మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు.దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. ముందుగా రూ.5 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్ లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.7 లక్షల 6 వేలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదు తో పాటు కమిషన్ చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225455
9912225462